ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

3

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 3 డిసెంబరు 2025



న్యాయ కోర్సుల్లో సీట్ల భర్తీకి అడ్మిషన్లు

ఎచ్చెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో మూడేళ్ల న్యాయ విద్యా కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 4న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా సెట్-2025లో అర్హత సాధించి, రెండు కౌన్సెలింగ్‌ల్లో ఏ కళాశాలలో కూడా చేరని విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బదిలీ, స్టడీ, నివాస ధ్రువీకరణ పత్రాలు, లాసెట్ ర్యాంకు కార్డుతో నేరుగా వర్సిటీకి హాజరుకావాలని సూచించారు. సీట్లు పొందిన వారికి వర్సిటీ నుంచి సమాచారం తెలియజేస్తామన్నారు.



డయేరియా బాధితులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

తాళ్లవలసలో ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించండి

● నీటి నమూనాలు విశాఖ ల్యాబ్‌లో పరీక్షించాలి

● మంత్రి అచ్చెన్నాయుడు ● డయేరియా బాధితులకు పరామర్శ

సంతబొమ్మాళి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తాళ్లవలసలో ఇంటింటా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి తాళ్లవలసలో ఆయన పర్యటించారు. డయేరియాతో మృతి చెందిన మార్పు చిన్నారావు ఇంటికెళ్లి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు. డయేరియా బాధితులతో కూడా మాట్లాడారు. అనంతరం రచ్చ బండ వద్ద గ్రామస్థులతో మాట్లాడుతూ.. డయేరియా వ్యాప్తికి గల కారణాలపై ఆరా తీశారు. గ్రామంలో మంచినీటి కుళాయిలకు వ్యవసాయ బావి నుంచి నీరు వస్తోందని, అది కలుషితమై ఉండవచ్చని గ్రామస్థులు తెలిపారు. వీధికాలువలపై సిమెంట్ పలకలు అమర్చలేదన్నారు. కాలువల్లో మురుగునీరు చెరువులో కలుస్తోందని, దానిని గెడ్డలోకి మళ్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. 'గ్రామంలో వైద్యపరీక్షలు నిర్వహించి వ్యాధి ఎలా వచ్చిందో నిర్ధారించాలి. డయేరియా బాధితులకు మెరుగైన చికిత్స అందజేయాలి. పలాస కిడ్నీ ఆసుపత్రి నుంచి వైద్యసిబ్బందిని రప్పించి కిడ్నీ వ్యాధి పరీక్షలు కూడా నిర్వహించాలి. కుళాయిల ద్వారా అందిస్తున్న తాగునీటి నాణ్యతను శాస్త్రీయంగా పరీక్షల కోసం విశాఖలో ఆధునిక ల్యాబ్ పంపాల'ని అధికారులను ఆదేశించారు. టెక్కలి మండలం (మిగతా 4వ పేజీలో..)

● రిమ్స్‌లో 373 పరికరాలకు పనిచేసేవి 42 మాత్రమే!

● మిగిలినవన్నీ మూలకు చేరిన వైనం ● అత్యవసర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం

వెంటిలేటర్లకు ఊపిరి ఆడేదెప్పుడు?

శ్రీకాకుళం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

అత్యవసర సమయంలో రోగి ప్రాణాలకు ఊపిరి పోయాల్సిన వెంటిలేటర్లు మూలకు చేరాయి. శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో నెలకొన్న తాజా పరిస్థితి చూస్తే రోగుల గుండెల్లో దడ పుట్టక తప్పదు. కాగితాల మీద వందల సంఖ్యలో వెంటిలేటర్లు కనిపిస్తున్నా.. ఆచరణలో పనిచేసేవి మూడో వంతు కూడా లేకపోవడం గమనార్హం. రిమ్స్‌లో రికార్డుల ప్రకారం మొత్తం 373 వెంటిలేటర్లు ఉన్నా, ప్రస్తుతం పనిచేస్తున్నవి కేవలం 42 మాత్రమే. మరి మిగిలిన 331 వెంటిలేటర్లు 'కండమ్'(కండెమనేషన్) చేయబడ్డాయి. అంటే అవి మరమ్మతులకు కూడా నోచుకోని స్థితిలో లేదా కాలం చెల్లిపోయి మూలన పడ్డాయని అర్థం. దాదాపు 88 శాతం జీవనధార పరికరాలు మూలనపడితే జిల్లా ప్రజల ప్రాణాలకు భరోసా ఎక్కడిది?. పీడియాట్రిక్, అడల్ట్ వార్డుల్లో తరుచూ వెంటిలేటర్లు అవసరం ఉంటున్నాయి. కానీ ఆశించినస్థాయిలో వెంటిలేటర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పాడైన వెంటిలేటర్లు

● విపత్తు వస్తే.. విలవిల్లాడాల్సిందేనా..?

గతంలో కొవిడ్ మహమ్మారి విరుచుకుపడినప్పుడు ఆక్సిజన్ అందక.. వెంటిలేటర్లు దొరక్క చాలా మంది మృతి చెందారు. ఆ సమయంలో 'వెంటిలేటర్లు లేవు' అని చేతులెత్తేసిన ప్రభుత్వాలు.. ఆ తర్వాత పాఠాలు నేర్చుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఒకవేళ రేపు కొవిడ్ వంటి మరో కొత్త వైరస్ వచ్చినా.. లేదా ఏదైనా భారీ ప్రమాదం జరిగి పదుల సంఖ్యలో అత్యవసర కేసులు వచ్చినా.. ఈ 42 వెంటిలేటర్లు ఏ మూలకు సరిపోతాయి?. అప్పటికప్పుడు కొత్తవి కొనలేరు. ఉన్నవాటిని బాగు చేయించలేరు. 'యుద్ధం వచ్చాక కత్తులు నూరుతాం' అన్నట్లుగా అధికారుల తీరు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 331 వెంటిలేటర్లు నిరుపయోగంగా మారినా వాటిస్థానంలో కొత్తవి సమకూర్చుకోవడంలో లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

● దృష్టి సారిస్తేనే.. ఫలితం

వెంటిలేటర్ అంటే కేవలం ఒక యంత్రం కాదు.. అది ఒక ప్రాణం. 331 వెంటిలేటర్లు మూలన పడటం అంటే 331 మంది ప్రాణాలకు రక్షణ కవచం లేనట్లే. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం కాబట్టి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించాలి. కండమ్ చేసిన 331 వెంటిలేటర్ల స్థానంలో వెంటనే కొత్తవాటిని మంజూరు చేయాలి. లేదా కనీసం ఆపరేషనల్ కెపాసిటీని 80 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలి. ఉన్న 42 వెంటిలేటర్లలో కూడా ఎప్పుడు ఏది మొరాయిస్తుందో తెలియదు. కాబట్టి బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగం (మిగతా 4వ పేజీలో..)

జీపీఎస్ పనిచేయట్లే!

● మిల్లుల వద్ద ధాన్యం ట్రక్కులతో పడిగాపులు

● తరచూ సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు

● ఆందోళన చెందుతున్న రైతులు



నరసన్నపేటలోని ఓ రైస్ మిల్లు వద్ద ధాన్యం లోడులతో నిరీక్షిస్తున్న రైతులు

● జమ్ము గ్రామానికి చెందిన సాదు రామారావు అనే రైతు.. 55 ధాన్యం బస్తాలను విక్రయించేందుకు గత నెల 23న షెడ్యూల్ తీసుకున్నారు. ట్రక్కు షీటు కోసం వారం రోజులు పాట్లు పడ్డారు. సోమవారం ఉదయం ట్రక్కుషీటు రాగానే.. ధాన్యాన్ని మిల్లు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మిల్లర్ లాగిన్‌లో ట్రక్కు షీటు కనిపించలేదు. దీంతో ధాన్యంతో వాహనం మిల్లు వద్ద నిలిచిపోయింది.

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి)

ధాన్యం విక్రయించేందుకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో సుమారు 6 లక్షల మంది రైతులు వరికోతలు పూర్తిచేశారు. సుమారు 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాలుగు రోజుల కిందట సర్వర్ మొరాయించడంతో గంటలపాటు నిరీక్షించారు. చివరికి కళ్లాల్లో ధాన్యం భద్రపరిచారు. ఆదివారం సెలవు కావడంతో.. సోమవారం మిల్లులకు ధాన్యం తీసుకెళ్దామని భావించారు. తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులు పడగా ధాన్యం కాపాడుకునేందుకు పాట్లు పడ్డారు. సోమవారం జీపీఎస్ సాంకేతిక సమస్య తలెత్తింది. మంగళవారం మధ్యాహ్నం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● మిల్లుల వద్ద నిరీక్షణ


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జనరేట్ అయిన ట్రక్కు షీట్లు.. మిల్లర్ల సైట్‌లో వాహనాలు చేరినట్టు చూపించడం లేదు. దీంతో మిల్లుల వద్ద ధాన్యం లోడులతో వాహనాలు నిలిచిపోతున్నాయి. జిల్లాలో 406 కొనుగోలు కేంద్రాల నుంచి సుమారు 1600 మంది రైతులు ధాన్యం విక్రయించేందుకు సోమవారం ట్రక్కుషీటు తీసుకున్నారు. జీపీఎస్ కలిగిన వాహనాల్లో ధాన్యం లోడింగ్ చేపట్టి మిల్లులకు తీసుకువచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ట్రక్కుషీటు జనరేట్ అయిన వివరాలు.. మిల్లుల వద్ద గల కస్టోడియన్ అధికారి (వీఆర్వో) లాగిన్‌లో కన్పిస్తున్నాయి. రైతు కళ్లాల నుంచి వాహనం మిల్లు వద్దకు చేరిన తరువాత మిల్లు యొక్క జీపీఎస్.. వాహనం యొక్క జీపీఎస్ అనుసంధానమై రైస్ మిల్లర్ యాజమాని లాగిన్ కన్పించాలి. కానీ సోమవారం మధ్యాహ్నం నుంచి ఆ వివరాలు కనిపించకపోవడంతో మిల్లులు వద్ద వాహనాలు నిలిచిపోయాయి. మిల్లర్ లాగిన్‌లో రైతుల ట్రక్కు షీటు కనిపిస్తే ధాన్యం దించుతామని మిల్లర్లు చెప్పడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. నాలుగు రోజులుగా మిల్లు వద్దే ఇబ్బందులు పడుతున్నామని కరగాం, కంబాయి, నారాయణవలస, అంపలాం, నర్సింగపల్లి గ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేయడంతో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయని రైతులు గొండు చలపతి, కోల కృష్ణారావు, తోట చిన్నవాడు, కడప లక్ష్మణరావులు ఆరోపించారు. ధాన్యం కొనుగోలు (మిగతా 4వ పేజీలో..)

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

సంతబొమ్మాళి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయించిన నాలుగు గంటల్లోపే వారి ఖాతాలో డబ్బులు జమవుతున్నాయని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఆర్డీవో కృష్ణమూర్తి, ఏడీఏ జగన్మోహన్‌రావు, వ్యవసాయాధికారి రాళ్లపాటి అప్పారావు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న, కలెక్టర్ స్వప్నిల్ దినకర్



వణికిస్తున్న స్క్రబ్ టైఫస్

● జిల్లాలో పెరుగుతున్న కేసులు

● గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా వైరస్ వ్యాప్తి

● ముందే మేల్కొనకపోతే ముప్పేనంటున్న వైద్యులు

రణస్థలం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులను స్క్రబ్ టైఫస్ వణికిస్తోంది. ఈ వైరస్ వ్యాప్తి కారణంగా జ్వరంతో ప్రారంభమై క్రమేపీ శ్వాస సంబంధ సమస్యలకు దారి తీస్తోంది. రాష్ట్రస్థాయిలో 34 పాజిటివ్ కేసులు శ్రీకాకుళం జిల్లాలో నమోదయ్యాయని చెబుతుండగా, జిల్లా అధికారులు మాత్రం 7 కేసులు మాత్రమే పేర్కొంటున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో జ్వరాల తీవ్రత పెరుగుతోంది. ఈ తరుణంలో నిర్ధారణ పరీక్షల్లో ఈ కొత్త వైరస్ వెలుగుచూస్తుండడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా వైరస్ వ్యాప్తి చెందుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలోని ల్యాబ్‌లో ఈ వైరస్ నిర్ధారణకు పరీక్షలు చేస్తున్నారు.

● ఇన్‌ఫెక్షన్ల రూపంలో బయటకు..

విదేశాల్లో గుర్తించిన ఈ వైరస్ మన దేశంలోకి వ్యాపించింది. మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఈ కేసులు నమోదవుతున్నాయి. స్క్రబ్‌టైఫస్ అనేది నల్లిని పోలిన చిన్న కీటకం. ఈ కీటకం కుడితే శరీరంపై నల్లని మచ్చ, దద్దుర్లు వస్తాయి. వారం, పదిరోజుల తరువాత జ్వరం, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణసమస్యల (మిగతా 4వ పేజీలో..)

చురుగ్గా నిర్ధారణ పరీక్షలు

జిల్లాలో 7 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అందుకే నిర్ధారణ పరీక్షలు పెంచుతున్నాం. జ్వరం అని తేలిగ్గా తీసుకోవద్దు. అనుమానిత లక్షణాలు ఉంటే వెంటనే శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

- కె.అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే చర్యలు తప్పవు

● మద్యం తాగి తరచూ దొరికితే జైలుశిక్ష: ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

5లో

మైనర్ డిగ్రీ కోర్సులుగా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం

ఎచ్చెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో మైనర్ డిగ్రీ కోర్సులుగా ఈ విద్యా సంవత్సరం నుంచి కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం కోర్సులను ప్రారంభిస్తున్నట్టు డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. క్యాంపస్‌లో మంగళవారం ఈ కోర్సులను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వర్సిటీ నిబంధనల ప్రకారం ఇవి 20 క్రెడిట్ కోర్సులు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు కొనసాగుతాయి. వీటితోపాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ కోర్సులను కూడా మైనర్ డిగ్రీలుగా ఆఫర్ చేస్తున్నాం. విద్యార్థుల ఆసక్తి మేరకు ఈ కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ డిగ్రీ మేజర్‌గా, మైనర్‌గా ఈ కొత్త కోర్సులను గుర్తిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో క్యాంపస్ ఏవో డాక్టర్ మునిరామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ

ప్రతి కార్యాలయంలో ఈ-ఆఫీస్ తప్పనిసరి

● దస్త్రాలను సకాలంలో పరిష్కరించాల్సిందే

● నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వారం రోజుల్లో ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ విభాగాలవారీగా దస్త్రాల పరిష్కారంపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్థికాంశాలతో కూడినవి, మరీ సంక్లిష్టమైనవి తప్ప.. మిగిలిన దస్త్రాలన్నీ ఆలస్యానికి తావులేకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ-ఆఫీసు దస్త్రాల పరిష్కారంలో వెనుకబడిన ఇచ్ఛాపురం, ఆమదాలవలస, పలాస మునిసిపాలిటీలు, ఏపీఎస్ఐడీఎస్, జిల్లా రిజిస్ట్రార్ వంటి శాఖలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ-ఆఫీస్ నిర్వహణలో ప్రతిభ కనబరచకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో డయేరియా వ్యాప్తిపై కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఆహారం, నీరు, పారిశుధ్యం విషయంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి. వేడిచేసి చల్లార్చిన నీటిని తాగేలా, వేడి ఆహారాన్ని తీసుకునేలా.. ప్రజల్లో అవగాహన పెంచాలి. ఆహార కల్తీ నియంత్రణ అధికారులు హోటల్స్, సినిమా హాళ్లు, రోడ్ సైడ్ ఫుడ్ స్టాళ్లను వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలి. తనిఖీల పేరుతో వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టరాదని స్పష్టం చేశారు. అలాగే ధాన్యం సేకరణలో బ్యాంక్ గ్యారెంటీలు, వాహనాల రిజిస్ట్రేషన్, టార్పాలిన్ లభ్యతపై చర్చించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ దిశానిర్దేశం చేశారు. సానుకూల ప్రజాభిప్రాయం కోసం పింఛన్లు, వ్యవసాయం, ప్రభుత్వ ఆసుపత్రి, రెవెన్యూ సర్వే ఏపీఎస్ ఆర్టీసీ సేవలు వంటి అంశాలపై అధికారుల చొరవ చూపాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఆసుపత్రిలో మందుల పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.55.11 లక్షలు

అరసవల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి హుండీల లెక్కింపు మంగళవారం అనివెట్టి మండపంలో నిర్వహించారు. 40 రోజులకుగాను రూ.55,11,915 ఆదాయం వచ్చినట్లు ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. నోట్ల రూపంలో రూ.50,51,052.., చిల్లర ద్వారా 4,60,863 లభించిందన్నారు. కార్యక్రమంలో వివిధ దేవాలయాల ఈవోలు జి.గురునాధరావు, శ్యామలరావు, సుకన్య, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ సిబ్బంది, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవకులు, సిబ్బంది

ఆలివ్‌రిడ్లే తాబేళ్ల మృత్యువాత 4లో

ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు

ఆర్వో ప్లాంట్ వద్దు
● భూగర్భ జలాలను పరిరక్షించాలి
● నగరప్పాలెం గ్రామస్థుల విజ్ఞప్తి
5లో

ఆలివ్‌రిడ్లే తాబేళ్ల మృత్యువాత

- గుడ్లు పెట్టేందుకు వచ్చిన సమయంలో కుక్కలు, నక్కలు, ఎలుగుబంట్లు దాడి
- తీరంలో దుర్గంధంతో పర్యాటకులకు తప్పని ఇబ్బందులు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తీరంలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఏటా నవంబరు, డిసెంబరుల్లో ఆలీవ్‌రిడ్లే తాబేళ్లు సముద్రతీరంలో గుడ్లుపెట్టేందుకు వస్తుంటాయి. ప్రస్తుతం ఇచ్ఛాపురం నుంచి ఎచ్చెర్ల వరకూ ఉన్న తీరంలో ఆలీవ్‌రిడ్లే తాబేళ్లు కనిపిస్తున్నాయి. అయితే ఒడ్డున తిరుగుతున్న నక్కలు, కుక్కలు, ఎలుగుబంట్లు దాడిలో మృతిచెందుతుండడంతో తీరంలో దుర్గంధం వెదజల్లడంతో పర్యాటకులు ఇబ్బందిపడుతున్నారు.

మహా సముద్రాల్లో జీవనం..

మహా సముద్రాల్లో జీవించే ఆలీవ్‌రిడ్లే తాబేళ్లలో ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు ఉష్ణ మండలంలోని సముద్రతీరాన్ని ఎంపిక చేసుకుంటాయి. అక్కడ ఇసుకలో గోతులు తవ్వి గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతుంటాయి. ఆ సమయంలో ఒడ్డున్న ఉన్న కుక్కలు, నక్కలు, ఎలుగుబంట్లు తాబేళ్లపై దాడిచేస్తుంటాయి. దీంతో తీరం మృతిచెందిన తాబేళ్ల కళేబారాలతో దర్శనమిస్తోంది. మగ తాబేళ్లు మాత్రం సముద్రంలో ఉంటాయని కేవలం ఆడతాబేళ్లు మాత్రమే గుడ్లు పెట్టేందుకు తీరానికి వచ్చి మృత్యువాతపడుతుంటాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. అయితే ఇసుకలో పెట్టిన గుడ్లు పిల్లలుగా మారిన తరువాత ఇవి మళ్లీ సముద్రంలో వెళ్లిపోతాయి.


శివసాగర్ తీరంలో మృత్యువాత పడిన ఆలీవ్‌రెడ్లు తాబేళ్లు

నాచు, చేపపిల్లలే ఆహారం

సముద్ర తాబేళ్లకు ఆహార నియమావళిలో ఒక ప్రత్యేకత ఉంది. పిల్లతాబేళ్లు మాత్రం సర్వభక్షలుగా ఉంటాయి. అంటే సముద్రంలో ఉన్న నాచుతోపాటు చిన్న చిన్న చేపపిల్లలు కూడా ఆహారంగా తీసుకుంటాయి. పెద్దైన తరువాత ఇవి శాఖాహారులుగా మారి సముద్రం ఉన్న నాచుమాత్రమే తింటూ జీవిస్తుంటాయి. అరుదైన జాతుల్లో ఒకటైన తాబేళ్లు సముద్రంలో వాతావరణ మార్పుల వల్ల పేరుకుపోయిన నాచును తిని పర్యావరణాన్ని కాపాడుతున్నాయని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈక్రమంలో గుడ్లు పెట్టే సమయంలో తీరానికి వచ్చే తాబేళ్లు మృత్యువాతపడుతున్నాయి. అంతరించుపోతున్న 900 రకాలు జీవాల్లో తాబేళ్లు కూడా ఉండడం విశేషం.

గుడ్లను సంరక్షణ కేంద్రాల ఏర్పాటు..

తాబేళ్లుపెడుతున్న గుడ్లు తీరంలో ఉన్న జంతువులు నాశనం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో మెట్టూరు, చినకొత్తూరు, కొత్తపేట తదితర గామాల్లో గుడ్లను సంరక్షణ కేంద్రాలను స్థానిక యువత ఏర్పాటు చేశారు. అయితే మృత్యువాత పడుతున్న తాబేళ్ల కళేబారాన్ని తరలించేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

- డీఈవో రవిబాబు

గుజరాతీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధి కారి రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి పూర్తి గా తాత్కాలిక ప్రాతిపదికన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను ఐదు నెలలకు నియమించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించారన్నారు. ఈ మేరకు స్కూల్ అసిస్టెంట్లకు నెలకు రూ.12,500, ఎస్‌జీటీలకు నెలకు రూ.10,000 గౌరవవేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లుగా పనిచేసేందుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 3 నుంచి ఐదో తేదీలోగా సంబంధిత ఎమ్మార్సీల్లో దరఖాస్తులను సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

మండల వారీగా పోస్టుల వివరాలిలా..

ఇచ్ఛాపురం ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ (ఒరియా) 2, ఎస్‌ఏ గణితం (ఒరియా) 1, ఎస్‌ఏ ఎస్‌ఎస్ 3 పోస్టులున్నాయన్నారు. కంచిలి మండలం ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ (ఒరియా) 1, కవిటి మండలం ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ ఒరియా 3, ఎస్‌ఏ గణితం ఒరియా 1 పోస్టు ఉన్నాయన్నారు. మెళియాపుట్టి ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ ఒరియా1, ఎస్‌ఏ ఎస్‌ఎస్ 1, పలాస మడలం ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ ఒరియా 1, ఎస్‌ఏ పీఎస్ ఒరియా 1, ఎస్‌ఏ ఎస్‌ఎస్ 1, పాతపట్నం ఎస్‌ఏ గణితం ఒరియా 1, ఎస్‌ఏ పీఎస్ ఒరియా 1, సోంపేట మండలం ఎస్‌ఏ బయోలాజికల్ సైన్స్ ఒరియా 1, ఎస్‌ఏ గణితం ఒరియా 1, ఎస్‌ఏ పీఎస్ ఒరియా 1 పోస్టు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

వెంటిలేటర్లకు 'ఊపిరి' ఆడేదెప్పుడు?

(మూడో పేజీ తరువాయి)

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. కేవలం పరికరాలు ఉంటే సరిపోదు. ఆపద వచ్చినప్పుడు వాటిని ఆపరేట్ చేయడానికి సరిపడా టెక్నీషియన్లు ఉన్నారా? లేదా? అన్నది పరిశీలించాలి. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నిధులు, ప్రభుత్వ ప్రత్యేక గ్రాంట్ల ద్వారా వెంటిలేటర్ల మరమ్మతులు, కొనుగోలుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా మేల్కొని మరో విపత్తు రాకముందే రిమ్స్ వెంటిలేటర్లకు 'ఆక్సిజన్' అందించాల్సిన అవసరం ఉంది.

● ప్రభుత్వానికి విన్నవించాం..

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో 331 వెంటిలేటర్లు మూలకు చేరాయి. అత్యధిక వెంటిలేటర్లు కోవిడ్ సమయంలో పీఎం కేర్స్ ఫండ్ నుంచి మంజూరైనవే. ఇవి కొన్నాళ్ల కిందట పాడయ్యాయి. వాటి నిర్వహణకు సంబంధించి ఆయా సంస్థలవారు ఉండరు. ప్రస్తుతం అత్యవసరంగా వెంటిలేటర్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించాం. ప్రతిపాదనలను కూడా సిద్ధం చేసి ఆసుపత్రి సమావేశంలో ప్రస్తావించాం.

-డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, రిమ్స్

జీపీఎస్ పనిచేయట్లే!

(మూడో పేజీ తరువాయి)

ప్రక్రియలో లోపాలను సరిదిద్దాలని కోరుతున్నారు.

సమన్వయ లోపం..

ధాన్యం కొనుగోలు పక్రియ అంతా సివిల్ సప్లయ్ శాఖ పర్యవేక్షణ ఉండగా, వాహనాలు జీపీఎస్ విధానం.. అనుసంధానం పక్రియ వంటి సాంకేతిక పరమైన అంశాలను థర్డ్‌పార్టీకి అప్పగించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం కావాలంటే ఈ రెండు శాఖలకు చెందిన అధికారులు, సాంకేతిక సిబ్బంది.. సమన్వయంతో సాగాలి. కానీ సమన్వయం లేకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

లోపాలు సరిదిద్దుతాం..

మిల్లర్లు లాగిన్‌లో వాహనాలు చేరినట్లు కనిపించకపోవడం వాస్తవమే. దీనిపై జీపీఎస్ సాంకేతిక సిబ్బందికి సమాచారం ఇచ్చాం. ఇతర జిల్లాల మిల్లులకు వెళ్లినట్లు కూడా కనిపిస్తున్నాయి. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. లోపాలను సరిదిద్ది రైతులు ఇబ్బంది లేకుండా చూస్తాం.

-వేణుగోపాలరావు, డీఎం, సివిల్‌సప్లయ్‌శాఖ, శ్రీకాకుళం

తాళ్లవలసలో ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించండి

(మూడో పేజీ తరువాయి)

సాకిపల్లి వరకు వస్తున్న మంచినీటి పైపులైను తాళ్లవలస వరకు పొడిగించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి సూచించారు. గ్రామస్థులెవరూ ఆందోళన చెందవద్దని, డయేరియా అదుపులోకి వచ్చే వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో భారతీ సౌజన్య, ఆర్డీవో కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వణికిస్తున్న స్క్రబ్‌టైఫస్

(మూడో పేజీ తరువాయి)

రూపంలో ఇన్‌ఫెక్షన్ బయటపడుతుంది. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే శ్వాస సంబంధిత రుగ్మతలకు దారితీస్తాయి. మెదడు, వెన్నెముక ఇన్‌ఫెక్షన్లతో పాటు మూత్రపిండాల వైఫల్యానికి కూడా దారితీసే అవకాశం ఉంది. స్క్రబ్‌టైఫస్ పీడితులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తే మరణాల రేటు 2 శాతం లోపు ఉంటుంది. సకాలంలో చికిత్స అందించకపోతే రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది.

● ఆ ప్రాంతాల్లో అధికం..

జిల్లాలో వంశధార, నాగావళి, మహేంద్రతనయా, బాహుదా నదులు ఉన్నాయి. ఆపై ఏజెన్సీతో పాటు ఉద్దాన ప్రాంతం ఉంది. అక్కడ కీటకాల సంచారం అధికం. అందుకే ఈ వైరస్ వేగంగా వ్యాప్తికి అవకాశం ఉంది. ఆగస్టు నుంచి ఫిబ్రవరి మధ్య స్క్రబ్‌టైఫస్ కీటకాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకదు. కానీ కీటకం కాటుకు గురైన వ్యక్తి మాత్రం అస్వస్థతకు గురవుతారు. అందుకే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. తడి నేలలు, పొదలు, తోటలు, పొలాలు, పశువుల శాలలు, పాకలు, వ్యర్థాలు పోగుచేసే ప్రాంతాల్లో పనిచేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలి. పూర్తి చేతులు ఉన్న చొక్కాలు, ప్యాంట్లు, కాలికి సాక్సులు, బూట్లు ధరిస్తే మంచిది. ఇళ్లలో పాత మంచాలు, పరుపులు, దిండ్లలో ఈ కీటకాలు చొరబడే అవకాశం ఉన్నందున వాటిని మార్చాలి. లేదంటే శుభ్రం చేశాక వాటిని వాడాలి. పిల్లలు ఆరుబయట ఆటలు ఆడే సమయంలో సైతం అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

వీఏఏపై చర్యలకు అనుమతి

శ్రీకాకుళం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై చర్యలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీచేసింది. ఆ వివరాలిలా ఉన్నాయి. కొన్నాళ్ల కిందట కొత్తూరు మండలం బలద గ్రామ సచివాయలయం పరిధిలో రైతుభరోసా కేంద్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా రత్నాల లక్ష్మీ కల్యాణి విధులు నిర్వహించారు. ఆ సమయంలో కొన్ని ఆరోపణలు రావడంతో ఏసీబీ కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. ఇప్పటికే విచారణ పూర్తి చేసి నివేదిక ఇచ్చారు. అయితే ఇంతవరకు సేకరించిన వివరాలను ప్రస్తుతం ఏసీబీ సీఐ కె.భాస్కరరావు ప్రభుత్వం నియమించిన విచారణాధికారి వద్ద సమర్పించాల్సి ఉంది. విచారణాధికారిగా ఇప్పటికే ప్రభుత్వం విజయనగరం డీఏఓ వీటీ రామారావును నియమించింది. ఆయన ఎదుట సీఐ ఆ వివరాలు సమర్పించాల్సి ఉంది. విచారణాధికారి నివేది కను ప్రభుత్వానికి పంపనున్నారు.

ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు

- వీరభద్రపురం, మలగాంలో స్థలాన్ని పరిశీలించిన ఏపీఎస్ఐడీసీ ఎస్ఈ సుబ్రహ్మణ్యం


రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ సుబ్రహ్మణ్యం


సంతబొమ్మాళి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మలగాం ప్రాంతానికి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించేందుకు పూర్తిస్థాయిలో అంచనాలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని ఏపీఎస్ఐడీసీ ఎస్ఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీరభద్రపురం, మలగాంలో ఎత్తిపోతల పథకానికి స్థలాన్ని పరిశీలించారు. బోరుభద్ర పంచాయతీ పరిధిలోని వీరభద్రపురం (రొక్కంపేట) వద్ద గరీబులగెడ్డ ద్వారా సముద్రంలోకి వృథాగా పోతున్న మిగులు జలాలను 27 టి.ఉదయపురం వంశధార కాలువలోకి మళ్లించి శివారు పంటపొలాలకు సాగునీరందించేలా ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. దీని ద్వారా బోరుభద్ర, గొదలాం, సీపురం, మలగాం ప్రాంతాల్లోని మూడు వేల ఎకరాలకు సకాలంలో సాగునీరు అందే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. సోమవారం మలగాం పంచాయతీలో పర్యటించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి సాగునీటి సమస్యను ప్రజలు తీసుకువెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాలతో ఎస్ఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అధికారులు రొక్కంపేట వద్ద నీటి లభ్యతతోపాటు నీటి మళ్లించే సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, రాష్ట్ర ఐటీడీపీ అధికార ప్రతినిధి అప్పిని వెంకటేష్, మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.


ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ

రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజీతో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం




భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భద్రత కోసం అనేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొ న్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మద్యం సేవించి వాహనం నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని, వీటికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో వివిధ కేసుల్లో పట్టుబడిన వారి జరిమానా వివరాలను ఆయన వెల్లడించారు. కాశీబుగ్గ, టెక్కలి, మెళియా పుట్టి స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో 33 మంది పట్టు బడగా వారికి సంబంధిత కోర్టులు జరిమానా విధించాయన్నారు. కాశీబుగ్గ, పలాస మండలంలో మద్యం సేవించి వాహ నాలు నడిపిన ముగ్గురు వాహనచోదకులను కోర్టులో హాజరుపర్చగా టెక్కలి జ్యూడీ షియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారన్నారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి న్యూసెన్స్ సృష్టించిన 18 మందికి ఒక్కొక్కరికి రూ.1000 వంతు జరిమానా విధించినట్లు తెలిపారు. టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహ నాలు నడిపిన ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున, మెళియాపుట్టి స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాల నడిపిన ఇద్దరికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమా నా విధించార న్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఏడుగురికి రూ.1000 చొప్పున జరిమానా విధించారని ఎస్పీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి రోజూ జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి వాటిపై తని ఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటువంటి కేసుల్లో జరిమానాలు మాత్రమే కాకుండా తరచూ పట్టుబడిన వారికి జైలు శిక్ష తప్పదని ఎస్పీ హెచ్చరించారు. ప్రజల భద్రత నిమిత్తం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

- డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే చర్యలు తప్పవు
- బహిరంగంగా మద్యం తాగి దొరికితే జైలుశిక్ష
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



సాంకేతిక సమస్యలు లేకుండా చర్యలు

- ఆర్డీవో సాయి ప్రత్యూష



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

గార, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం మిల్లులకు చేరే వరకు ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సాయి ప్రత్యూష ఆదేశించారు. మంగళవారం శ్రీకూర్మం జంక్షన్ వద్ద సాయి శ్రీనివాస, శ్రీకూర్మంలోని శ్రీరాజరాజేశ్వరి మోడరన్ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ దిశలో నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, సీఎస్‌డీటీ అనిల్ కుమార్, వీఆర్వోలు ఎస్.అప్పలనాయుడు, ఎస్.దినేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై వైసీపీ నేతల తప్పుడు ఆరోపణలు

ఆమదాలవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్‌పై వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్రనాయకుడు మొదలవలస రమేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతావిద్యాసాగర్, నాయకులు కొత్తకోట అమ్మి నాయుడు, నూక రాజు, ఎస్.మురళీధర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా వైసీపీ నేత చింతాడ రవికుమార్ ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తుండడం తగదన్నారు. ఇటీవల సరుబుజ్జిలి వైన్స్‌షాప్‌లో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు డబ్బులకు కక్కుర్తి పడి మద్యంలో నీళ్ల కలిపితే అధికారులు వారిపై కేసు నమోదు చేశారన్నారు. ఆ ఇద్దరితో పాటు షాపు యజమానిపై కూడా కేసు నమోదు చేసి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే రవికుమార్ తమ నిబద్ధతను నిరూపించుకున్నారన్నారు. అయితే దీనిని వైసీపీ నేతలు భూతద్దంలో పెట్టి విమర్శించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నేతలు తమ్మినేని చంద్రశేఖర్, బి.అప్పారావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు శిమ్మ మాధవి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకం లాభదాయకం



రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

రణస్థలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకం రైతులకు లాభదాయకమని ఎంటమాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ (హైద్రాబాద్) సిద్ధిపేట శైలజ అన్నారు. మంగళవారం పైడిభీమవరంలో తేనెటీగల పెంపకంపై రైతులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడు తూ.. తేనెటీగల పరాగ సంపర్కం వల్ల అధిక దిగుబడి సాధ్యమని, తేనెటీగలే లేకపోతే మానవ మనుగుడ లేదన్నారు. పంట దిగుబడులకు తేనెటీగలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. వీటిపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు, లహరి, నరసింహమూర్తి, దేవుడుబాబు, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే పైనుంచి నీరు

- రాకపోకలకు ఇబ్బందులు



కాజ్‌వై నుంచి ప్రవహిస్తున్న నీరు

గార, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు మండలంలోని తూర్పు పంచాయతీ జాఫ్రాబాద్ కోమటి చెరువు వద్ద కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతం బాగా నాచుపట్టి ఉండడంతో దానిపై నుంచి నీరు రోడ్డుపైకి రావడంతో వాహనాలతో పాటు కాలినడకన వెళ్లేందుకు ఇక్కట్లకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. గత రెండు రోజులుగా కాజీపేట నుంచి పెద్దగా వర్షపునీరు ప్రవహిస్తుండడంతో కాజ్‌వే పైనుంచి వాహనాలు రాకపోకలతో పలు ప్రమాదాలకు గురవుతున్నారని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షం నీరు తగ్గిన తర్వాత కాజ్‌వేపై పూర్తిస్థాయిలో రాకపోకలు సాగిం చేలా చర్యలు తీసుకోవాలని తూలుగు పంచాయతీ సర్పంచ్ కొయ్యాన సంధ్యారాణి అధికారులను కోరుతున్నారు.

సర్వే వేగవంతం చేయాలి

జి.సిగడాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని డీఎల్ పీవో గోపీబాల అన్నారు. జి.సిగడాం, గెడ్డకంచరాం, గొబ్బూరు తదితర గ్రామాల్లో మంగళ వారం సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే పూర్తిచేసిన వెంటనే హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాల న్నారు. ఎంపీడీవో జి.రామకృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి సాహు తదితరులు పాల్గొన్నారు.



గెడ్డకంచరాంలో సర్వేని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఆర్వో ప్లాంట్ వద్దు..

- భూగర్భ జలాలను పరిరక్షించాలి
- ముక్తకంఠంతో కోరిన నగరప్పాలెం గ్రామస్థులు

రణస్థలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పరిరక్షించాలని, ఇప్పటికే వ్యవసాయ బోర్ల నుంచి నీరందడం లేదని రణస్థలం పంచాయతీ నగరప్పాలెం, బండిపాలెం గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. మంగళవారం సంబంధిత ప్లాంట్ యాజమాన్యం రైతుల తో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయం తెలుసుకున్నారు. అయితే రైతులు, గ్రామస్థులు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి పంటలకు నీరందకుండా చేయవద్దని, దీనిని పూర్తిగా వ్యతిరే కిస్తున్నామని ముక్తకంఠంతో తెలిపారు. ఆర్వో ప్లాంట్ విధి విధానాలను సంబంధిత ప్లాంట్ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ కరిమజ్జి మల్లేశ్వరరావు, కరిమజ్జి జగన్నాథం, బాషా, మజ్జి రమేష, చందక రమణ తదితరులు మాట్లాడుతూ.. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తే కొన్ని వందల అడుగుల్లో బోర్లు వేసి నీరు తీస్తారని, 100, 150 అడు గుల్లో బోర్లు ఏర్పాటు చేసుకుని పంటలు పండిస్తున్న రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్లాంట్‌కు అనుమతులు ఇస్తే ఊరుకునేదని స్పష్టం చేశారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయ వద్దని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశామని పలువురు రైతులు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న నగరప్పాలేం గ్రామస్థులు

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలి

రణస్థలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం రావాడ జంక్షన్ వద్ద ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. రూ.25 వేలు వేతనం ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. గత ఆరేళ్ల నుంచి ఒక్క రూపాయి కూడా పెంచలేద న్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



పీవోతో మాట్లాడుతున్న ప్రతినిధులు

సోంపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొర్లాం, పాలవలస, గొనకపాడు, లక్ష్మీపురం, కుమ్మరిపాడు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను చైల్డ్‌లైన్ ప్రొడక్షన్ ఫోరం ప్రతినిధులు నరసింహులు యాదవ్, గోవింద రాజులు, మహిళా కార్యదర్శి నాగమణి, శకుంతల తదితరులు మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సరఫరా చేస్తు న్న పౌష్టికాహార ప్రమాణాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సోంపేట ఐసీడీఎస్ పీవో వసుంధరా దేవి దృష్టికి తీసుకెళ్లి చర్చించారు.


రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



శంకర్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిదులు

ఇచ్ఛాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ రెడ్డిక సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డికి బెల్లుపడ గ్రామస్థులు, సంఘ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. శాలు వా కప్పి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. తనకు చైర్మన్ పదవిని కట్టబెట్టిన ఎమ్మెల్యే అశోక్‌కు రుణపడి ఉంటానన్నారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, రెడ్డిక కులపెద్దలు, నీటి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న బీజేపీ నేతలు

జి.సిగడాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాడ గ్రామంలో అగ్ని ప్రమాదానికి సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను మంగళవారం బీజేపీ నాయకులు పరామర్శించారు. ఇజ్జు ఆదిలక్ష్మి, తిరుమరెడ్డి లక్ష్మీకాంతంలకు చెందిన పూరిళ్లు కాలిపోయిన విషయం తెలుసుకొన్న పార్టీ నాయకులు పైల విష్ణుమూర్తి, వజ్జపర్తి రఘురాం, ఎం.చిరంజీవి తదితరులు పరామ ర్శించి ఓదార్చారు. పక్కా ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లి కృషి చేస్తామన్నారు. అనంతరం బాధితులకు నిత్యవసర సరుకులు, వస్త్రాలను అందజేశారు. నేతలు ముద్దాడ త్రినాథరావు, శంకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సోంపేట సీఐ బి.మంగరాజు అన్నారు. కర్తలి గ్రామంలో నారీశక్తి సంకల్పం కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.పారినాయిడు, టీడీపీ నాయకులు వి.రమేష్ రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

- కేజీబీవీ కార్యదర్శి దేవానందరెడ్డి

లావేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రమ శిక్షణ అవసరమని, దీనిని పెంపొందించుకునే దిశలో పాటుపడాలని కేజీబీవీ కార్యదర్శి దేవానందరెడ్డి అన్నారు. మంగళవారం మురపాక కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థినుల సామర్థ్యంపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బల్ల సుధ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న దేవానందరెడ్డి

జాతీయస్థాయి విజేతకు అభినందన

ఎచ్చెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లో ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలో వర్సిటీ తరపున పాల్గొని కాంస్య పతకం సాధించిన గుజ్జల వర్షితను అభినందించారు. మంగళవారం వర్సిటీలో ఆమెను వీసీ, ప్రొఫెసర్ కేఆర్ రజని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్‌లో జరిగే పోటీ ల్లోనూ పాల్గొని వర్సిటీ పేరును ఇనుమడింప జేయాలని ఆకాంక్షించారు. వర్షితను స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు మరింతగా రాణించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి.అడ్డయ్య, స్పోర్ట్స్ డీన్ పి.రవికుమార్, పీడీలు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



వర్షితను అభినందిస్తున్న వీసీ కేఆర్ రజని తదితరులు

భూసేకరణపై పూర్తి నివేదిక అందించండి: జేసీ

ఆమదాలవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో ఊసవానిపేట రైల్వేగేటు ప్రాంతంలో నిర్మాణం చేపట్టనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించిన భూసేకరణ చేసి పూర్తి నివేదికను అందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు చేపట్టిన భూసేకరణ అలైన్‌మెంట్‌ను జేసీ పరిశీలించి ఆ వివరాలను తహసీల్దార్ రాంబాబును అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, రైల్వే సర్వే అధికారులు పాల్గొన్నారు.



రైల్వే భూసేకరణ స్థలాన్ని పరిశీలన చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

‘థర్మల్’ వద్దంటూ నిరసన

సరుబుజ్జిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వెన్నెలవలస గ్రామంలో మంగళవారం థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తక్షణమే థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ సదరు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ బాడంగి సురేష్ దొర, కార్యదర్శి సమర సింహాచలం, కోశాధికారి అత్తులూరి రవికాంత్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన గిరిజనులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కొండ ప్రాంతాలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న గిరిజనుల బతుకులను థర్మల్ ఏర్పాటుతో బూడిద చేయవద్దని నిరసనకారులు అన్నారు.



థర్మల్ ప్రతులను దహనం చేస్తున్న ఆందోళనకారులు

థర్మల్ ఆపకపోతే స్థానిక ఎన్నికల్లో బుద్ధిచెబుతాం

ఆమదాలవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో కూటమి ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రక్రియను విరమించకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించి తగిన బుద్ధి చెబుతామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, థర్మల్ పవర్‌ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ వాబ యోగేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండ పంలో కమిటీ సభ్యు లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీపీఐ జిల్లా నాయకుడు చాపర వెంకటరావు, థర్మల్ వ్యతిరేక పోరాట కార్యదర్శి సవర సింహాచలం, కోశాధికారి అత్తులూరి రవి కాంత్ మాట్లాడుతూ... గిరిజన గ్రామాల్లో బొగ్గుల కుంపటి థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఆదివాసీ బతుకులు బుగ్గిపాలు చేయ వద్దన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందింది పవర్ ప్లాంట్ ప్రతిపాదనను తక్షణం విరమించాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు సవర లక్ష్మణరావు, నగేష్, సింగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అధ్యాపకులతో కలిసి ఇంటర్ అడ్మిషన్‌ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకంతోపాటు నీట్, ఐఐటీ తదితర కాంపిటేటివ్ పరీక్షలకు ఉచితంగా మెటీరియల్స్ అందిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బి.సురేష్, పి.సురేష్, రవి, శివప్రసాద్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శరత్‌బాబు

మండల కేంద్రానికి వాటర్ టెస్టింగ్ మిషన్లు

గార, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో 25 గ్రామ పంచాయతీల్లో సరఫరా చేస్తున్న మంచినీటిని టెస్ట్ చేసి సురక్షితమైన తాగునీరందిం చేందుకు వీలుగా 30 వాటర్ టెస్టింగ్ మిషన్లు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నాయి. వీటిని అన్ని పంచా యతీలకు పంపి, నీటి సరఫరాలో ఏమైనా లోపాలుంటే సరి చేందుకు వీలు కలుగుతుందని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న వాటర్ టెస్టింగ్ మిషన్ కిట్లు

న్యూస్ బాక్స్

నేడు సామూహిక హనుమత్ వ్రతాలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం సామూహిక హనుమత్ వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ప్రత్తి శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, సింధూర మర్దనం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి

ఆమదాలవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం తీవ్ర నిరాశను కలిగిస్తోందని, తక్ష ణం బకాయిలను చెల్లించాలని మాజీ స్పీకర్, వైసీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం కోరారు. ఆమదాలవలసలోని స్వగృహంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో నెట్టబడుతోందన్నారు. సుమారు రూ.7, 800 కోట్లు కాలేజీలకు బకాయి ఉంచారని తక్షణం వీటిని విడుదల చేయాలన్నారు.

హెచ్‌ఎంపై ఆరోపణలు పెద్దరికాన్ని తగ్గించాయి

పొందూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తాడివలస ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బల్ల కంఠయ్యపై సర్పంచ్ టి.మనెమ్మ, పీఎంసీ చైర్‌పర్సన్ టి.అమ్మాజీ చేసిన ఆరోపణలు వారి పెద్దరికాన్ని, స్థాయిని తగ్గించాయని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో జరిగిన ప్రతీ విషయం తెలిసినా తప్పుడు ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

శతశాతం ఓట్లు సాధించాలి

కంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో బూత్‌స్థాయిలో శతశాతం ఓట్లు సాధించేలా ప్రణాళికలు తయారుచేయాలని పలాస ఏఎంసీ చైర్మెన్ మల్లా శ్రీనివాసరావు అన్నారు. కంచిలి, ఎంఎస్‌పల్లి పరిధిలో పలు బూత్‌లలో మంగళవారం స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. పార్టీ ఆదేశాలతో వచ్చానన్నారు. పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు, కార్యదర్శి పైల రామారావు, ఏఎంసీ చైర్మెన్ మద్దిల ధనలక్ష్మి, నేతలు నాగేశ్వరరావు, బంగారు కురయ్య, సనపల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

ఇచ్ఛాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో జప్తు చేసిన ద్విచక్ర వాహనాలను బుధ వారం బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ పి.దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో మధ్యాహ్నం 2 గంటలకు కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్న వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

అపరాల సాగుతో లాభం

కంచిలి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అపరాల సాగుతో రైతుకు ప్రయోజనం కలుగుతుందని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. అంపురంలో డ్రై సోయింగ్ పద్ధతిలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంజీవరావు, మీన రేవతి, భవానీ, జయలక్ష్మి, జ్యోతి, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.



తలుపులు ఊడి.. గోడలు బీటలు వారి

● శిథిలావస్థకు చేరిన భవనం ● బైపల్లిలో పునరావస కేంద్రం ఏర్పాటుచేస్తున్నవైనం ● ఇదీ అక్కుపల్లి తుపాన్ రక్షిత భవనం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కుపల్లి తుపాన్ రక్షిత భవనం శిథిలావస్థకు చేరుకొంది. 15 ఏళ్ల కిందట ఎన్‌సీఆర్‌ఎంపీ నిధులతో నిర్మించిన ఈ భవనం నిర్వహణ లోపం వల్ల మరమ్మతులు లేక తలుపులు ఊడిపోవడంతోపాటు, గోడలు బీటలు వారాయి. శ్లాబు పెచ్చులూడుతుండడంతో భవనాన్ని అధికారులు మూసివేశారు. తుఫాన్లు, ప్రకృతివైపరీత్యాల సమయంలో గ్రామంలో నివసిస్తున్న 1,500 మందికి షెల్టర్‌కోసం నిర్మించారు. తీరానికి అరకిలోమీటరు దూరంలోఉన్న ఈగ్రామం తుఫాన్ ప్రభావితగ్రామాల జాబితాలో ఉంది. ఇక్కడ భవనం శిథిలావస్థకు చేరడంతో తుఫాన్ల సమయంలో బైపల్లిలోని మల్టీపర్పస్ భవనంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేయాల్సివస్తోంది. దీనికితోడుఅక్కుపల్లి తుపాన్ రక్షిత భవనం ఇక్కడి ఉన్నత పాఠశాల మైదానం మధ్యలో నిర్మించారు.పాఠశాల విద్యార్థులు ఆడుకునే సమయంలో అటుగా భవనంలోకి వెళ్తే ప్రమాదాలు జరుగుతాయోనని తల్లిదండ్రులు ఆందోళనచెందుతున్నారు. గ్రామసచివాలయం కూడా తుఫాన్ షెల్టర్‌కు ఆనుకునేఉంది. సిబ్బందితోపాటు కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే వారంతా శిథిలావస్థకు చేరిన భవనం చూసి ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈతుఫాన్ షెల్టర్‌లోనే గతంలో ఉన్నతపాఠశాల తరగతులతోపాటు పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని కూడానిర్వహించిన విషయం విదితమే. తక్షణమే అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న అక్కుపలి తుఫాన్ రక్షిత భవనం

రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు: జేసీ


ఎల్.ఎన్.పేట: రైతులతో మాట్లాడుతున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఎల్.ఎన్.పేట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగించినా చర్యలు తప్పవని మిల్లర్లకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ధాన్యం కొనుగోలుకు సంబంధించి ట్యాగైన్ మిల్లులను పరిశీలించారు.బ్యాంకు గ్యారెంటీలు అయిపోయినా సాయి బాలాజీ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు అధికంగా ఉండడంతో జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మిల్లర్‌పై 6ఏ కేసు నమోదు చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మిగతా మిల్లులను పరిశీలించి కొనుగోలులో ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, సీనియర్ అసిస్టెంట్ ఎస్ గవరయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు ఉన్నారు.

ప్రతి ధాన్యం గింజ కొనుగోలుచేస్తాం

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి ధాన్యం గింజకొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి తెలిపారు. జమ్ముజంక్షన్ వద్దగల లక్ష్మీనారాయణ రైస్ మిల్లు, దేశవానిపేట బాలాజీ మిల్లుకు వచ్చిన ధాన్యం నాణ్యతను సివిల్‌సప్లయ్, వ్యవసాయశాఖ, ఎఫ్‌సీఐ, క్వాలిటీ కంట్రోల్, వ్యవసాయశాస్త్రవేత్తలు పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త కె.మురళీధర్, నరసన్నపేట ఏడీఏ వెంకట మధు, ఎఫ్‌సీఐ మేనేజర్ కె.అనుదీప్‌నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ క్వాలిటీ కంట్రోల్ సివిల్‌సప్లయ్ విభాగం అధికారి విజయరాజు, ఏవోలు చిరంజీవి, సూర్యకుమారి, వెంకట్రావు పాల్గొన్నారు.

ధాన్యం తడిచి.. పొలాల్లో నీరు చేరి

● దిత్వా తుఫాన్ నేపథ్యంలో భయాందోళన చెందుతున్నరైతులు


నందిగాం: సర్వీసు రహదారిలో ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

జిల్లాలో దిత్వా తుఫాన్ ప్రభావంతో అక్కడక్కడ అడపాదడపా కురిసిన జల్లులకు విక్రయానికి సిద్ధంచేసిన ధాన్యం తడిసిపోయాయి. పలు చోట్ల పంటపొలాల్లో నీరుచేరడంతో కోసిన వరి పనులు ఆరకపోవడంతో కుప్పలుగా పెట్టేందుకు రైతులు ఇబ్బందిపడుతున్నారు. పంటలు దెబ్బతిని నష్టపోతామేమోనని రైతులు భయాందోళన చెందుతున్నారు.

●పాతపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):పాతపట్నం పంచాయతీ కె.గోపాలపురం, ఏఎస్‌కవిటి పంచాయతీ పరిధితోపాటు పలుగ్రామాల్లో కళ్లాల్లో నూర్చేసి సిద్ధంగాఉంచిన ధాన్యం వర్షాలవల్ల తడిసిపోవడంతో రంగుమారిపోతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల పంటకొచ్చిన వరిచేను తుఫాన్ వల్ల కోతలు నిలిపివేశారు. దీంతో కంకులురాలిపోవడంతోపాటు నాణ్యత దెబ్బతినే అవకాశముందని రైతులు వాపోతున్నారు. పలుచోట్ల నూర్చేసిన ధాన్యం తడిచిపోయాయని రైతులు చెబుతున్నారు.

●వజ్రపుకొత్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలుచోట్ల తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి కురిసిన చిరుజల్లులకు పొలాల్లో నీరుచేరింది. దీంతో రైతులు కోతకోసి వరిపనలు తడుస్తుండడంతో బేజారవుతున్నారు. దీనికితోడు తుఫాన్ హెచ్చరికలనేపథ్యంలో వరికోతలు నిలిపివేశారు. అయితే అపరాలు విత్తనాలు చల్లి ఎక్కువ రోజులు అవుతుండడంతో కోత సమయంలో మొక్కలు తెగిపోయే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. అలాగే పంట బాగా పండడంతో వెన్ను విరిగిపోయే అవకాశముందని రైతులు చెబుతున్నారు.రిట్టపాడు,సీతాపురం, నగరపంల్లి, బెండి, గుల్లలపాడు రైతులు వరి కోతలు నిలిపివేశారు. తుఫాన్ తగ్గిన తర్వాత కోతలు ప్రారంభిస్తామని వారంతా చెబుతున్నారు.

●నందిగాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోమటూరు, నందిగాం తదితర గ్రామాల్లో సోమవారం పడిన చిరుజల్లులకు ధాన్యం, వరి పనలు తడిసిపోవడంతో మంగళవారం ఆరబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. రహదారులు, కల్లాల్లో ధాన్యాన్ని ఆరబెట్టి బస్తాల్లోకి ఎత్తి టార్పాలిన్లు కప్పారు.మంగళవారం కూడా ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం కురుస్తుందని ఆందోళన చెందారు.

వృద్ధురాలి అదృశ్యంపై ఫిర్యాదు


పార్వతీ (ఫైల్)

లావేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మురపాక గ్రామానికి చెందిన తన తల్లి వడ్డి పార్వతీ (64) అదృశ్యమైనట్లు పెద్ద కుమారుడు లక్ష్మణరావు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కొండపల్లి అప్పలసూరి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పార్వతీ మురపాక గొల్లబడి ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం పశువులను మేతకు తీసుకువెళ్లింది. ఆరోజు సాయంత్రం చీకటిపడినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. అయితే సమీప పంటపొలాల్లో కత్తిరించిన జుట్టు, చెప్పులు, తలలో ముడివేసుకున్న సవరం పడి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పార్వతీ భర్త గారయ్య ఇదివరకే మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి కనిపించడం లేదని కుమారుడు లక్ష్మణరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు లావేరు, రణస్థలం ఎస్ఐలు కొండపల్లి అప్పలసూరి, ఎస్.చిరంజీవి సిబ్బందితో కలిసి సదరు ప్రదేశాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లను ఉపయోగించి దర్యాప్తు చేపట్టినా ఆమె ఆచూకీ కానరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండపల్లి అప్పలసూరి తెలిపారు.

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై టూటౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. సంతబొమ్మాళి మండలం ఉమ్మిలాడకు చెందిన మైలపిల్లి అప్పస్వామి (58) తన కుమార్తె వరుస అయిన పిచ్చిక ఆదిలక్ష్మితో కలిసి విజయనగరం అమ్మవారిని దర్శించుకొనేందుకు సోమవారం గ్రామంలో బయలుదేరి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చాడు. అయితే కాంప్లెక్స్‌లో ఆమె వెనుక నిల్చొన్న అప్పలస్వామి అదృశ్యమయ్యాడు. దీంతో బంధువుల ఇంటిలో వెతికి మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ మేరకు టూటౌన్ సీఐ ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చంగుడిలో వృద్ధుడు...

పాతపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంగుడికి చెందిన ఆనంద పోరీడ (69) అదృశ్యమయ్యాడని కుమారుడు సంతోష్ పోరీడా ఫిర్యాదు మేరకు మంగళవారం కేసునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. హెచ్‌సీ వెంకటరమణ కథనంమేరకు.. ఆనందపోరీడ సోమవారం సాయంత్రం పొలానికి వెళ్లివస్తానని వెళ్లి తిరిగిరాలేదు. దీంతో సమీపంలో పొలాల్లో వెతికారు.గ్రామం సమీపంలోగల మహేంద్రతనయనదీ తీరంలో ఆనంద పోరీడ దుస్తులు, చెప్పులు పడిఉన్నట్లు గుర్తించి పోలీసులకు తెలియజేశారు. కాగా నదిలో కొట్టుకుపోయి గల్లంతైఉంటాడని అనుమానిస్తున్నారు. మంగళవారం కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆనంద పోరీడ ఫిర్యాదుచేశాడు.

బూర్జలో బంగారం చోరీ

బూర్జ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బూర్జలోని చెన్నూరు రమేష్ ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. ఆరుతులాల ముప్పావు బంగారం, 23 తులాల వెండి, రూ.లక్ష నగదు పోయినట్టు బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుడి కథనం మేరకు.. రమేష్ బూర్జలో టిఫిన్‌షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అరకు టూర్ నిమిత్తం కుటుంబంతో కలిసి శనివారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. సోమవారం రాత్రి సుమారు 11 గంటలకు శ్రీకాకుళం చేరుకున్నాడు. రాత్రి ఆలస్యమైనందున శ్రీకాకుళంలో బంధువుల ఇంటి వద్ద ఉండిపోయారు. మంగళవారం టిఫిన్‌షాప్‌లో పనిచేస్తున్న సూర్యనారాయణయజమాని ఇంటికి వెళ్లిచూడగా తలుపులుతీసి ఉండడంతో పక్కింటికివారితో రమేష్‌కు సమాచారం ఇచ్చారు. బాధితులు ఇంటికి వచ్చి చూడగా గుమ్మం, బీరువా తాళాలు తీసి బట్టలు చిందరవందరగా పడిఉన్నాయి. లాకర్లలో భద్రపరచుకున్న వస్తువులు ఏమీ లేవని చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు, సమాచారం సేకరించారు. చోరీ విషయం తెలుసుకున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు ప్రవల్లిక, ఎస్.బాలరాజు, ఫింగర్ ప్రింట్స్ సీఐ భరత్‌కుమార్ సదరు ఇంటిని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

నందిగాం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా విధించినట్లు నందిగాం ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. మండల పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీలో భాగంగా మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపిన నలుగురిపై మోటారు వెహికల్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈమేరకు మంగళవారం టెక్కలి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి మాధురి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

పదివేల రూపాయలు చొప్పున..

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన నందలాల్ మహాపాత్రో, సీతాపురానికి చెందిన కూన రఘు, మెళియాపుట్టి మండలంలోని పెద్దపద్మాపురానికి చెందిన కోటిలింగాల గోపిలు మద్యం సేవించి వాహనాలు నడపడంతో టెక్కలి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి ఒక్కొక్కరికి పదివేలు రూపాయలు చొప్పున్న జరిమాన విధించారని ఎస్ఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో మెలగాలి

నందిగాం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని టెక్కలి, పలాస డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ కోరారు. మంగళవారం మండలంలోని లఖిదాసుపురం జడ్పీ ఉన్నతపాఠశాల ఆవరణలో టెక్కలి నియోజకవర్గ స్థాయి 76వ గ్రిగ్స్ పోటీలను హెచ్ఎం చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో పారంభించారు. నియోజకవర్గ పరిధిలోని నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లోగల 60 పాఠశాలల నుంచి 650మంది విద్యార్థులుపోటీల్లో పాల్గొనగా, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించి సీనియర్, జూనియర్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు, మాజీసర్పంచ్‌లు ఎం.లోకనాథం, బి.మోహనరావు, జోనల్ ఇన్‌చార్జి కె.ప్రకాష్ నియోజకవర్గ క్రీడా ఇన్‌చార్జ్ ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

జలుమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జలుమూరు ప్రభుత్వ బాలకల ఉన్నతపాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులకు మండలస్థాయిలో క్రికెట్, త్రోబాల్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బమ్మిడి మాధవరావు మాట్లాడుతూ మండలస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లను నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, కరవంజ పీఈటీ వినోద్ కుమార్, పీఈటీలు పాల్గొన్నారు

ఎలక్ట్రికల్ వాహన పర్యావరణ వ్యవస్థపై పేటెంట్

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ స్మార్ట్‌సిటీల్లో సుస్థిరమైన ఎలక్ట్రికల్ వాహన పర్యావరణ వ్యవస్థ, గాలినాణ్యతా పర్యవేక్షణపై పరిశోధనా పత్రాన్ని రచించారు. ఈమేరకు పేటెంట్ హక్కులు సైతం సాధించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ సతీష్‌కుమార్‌ను అభినందించారు.

ఏఐసీసీ ఓబీసీ విభాగ సమన్వయకర్త నియామకం

పలాస, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జంటపట్టణాల్లోని ప్రముఖ వైద్యుడు జీవితేశ్వరరావును ఏఐసీసీ ఓబీసీవిభాగం జాతీయ సమన్వయకర్తగా నియమిస్తు ఆ పార్టీ ప్రధానకార్యదర్శి కేజీ వేణుగోపాల్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈమేరకు కాంగ్రెస్‌అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే సిఫార్సుల మేరకు జీవితేశ్వరరావును నియమించారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని తన ఎంపికే నిదర్శనమన్నారు.

అర్హులందరికీ ఆర్థిక సాయం: ఎమ్మెల్యే


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మామిడి గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం చేయనున్నట్లు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. మంగళవారం పాతపట్నంలోని క్యాంపుకార్యాలయంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, యరపత్ని సంతోష్, అక్కంధ్ర సన్యాసిరావు పాల్గొన్నారు. కాగా ఇటీవల అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో తనగళాన్ని వినిపించి ఆకట్టుకొన్న హిరమండలం మండలంలోని గులుమూరు జడ్పీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి జర్జన ప్రవీణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన కార్యాలయంలో అభినందించారు.

దాలిచెరువు ముంపుపై నివేదిక ఇవ్వాలి

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టెక్కలి దరి దాలిచెరువు ముంపు నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.ఈ మేరకు మంగళవారం దాలిచెరువు ముంపు వల్ల వందల ఎకరాల పంటలు దెబ్బతింటున్నాయని, రైతులకు న్యాయం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అట్టాడ రవిబాబ్జీతోపాటు రైతులు తమ్మినాన ఆనందరావు, బమ్మిడి మల్లేసు, కణితి సోమేసు, బూరె నరేంద్ర, రామ్‌జీ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ప్రాంతాన్ని ఒకసారి సందర్శించి దెబ్బతిన్న ముంపు పొలాలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈవిషయంపై స్పందించిన అచ్చెన్నాయుడు అధికారులతో మాట్లాడారు.

వెంకట్రావు సేవలు మరువలేనివి


వెంకట్రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి వెన్నెముకగా నిలిచిన త్రిపురాన వెంకట్రావు అలియస్ ప్రెస్ వెంకట్రావు పార్టీకి అందించిన సేవలు మరువలేనవని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం నరసన్నపేటలోని ఓ కల్యాణమండపంలో ఇటీవల మృతిచెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త త్రిపురాన వెంకట్రావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంస సభ్యులు లలిత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

పలాస, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో అందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం కళాశాలలో కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో లైబ్రేరియన్ బి.నర్సింహులు, అధ్యాపకులు వెంకటలక్ష్మి, పి.తారకేశ్వరరావు, హేమరాజు, సత్యనారాయణ, ఎం.హేమాచలం, వై.రాజేష్ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయండి

కొత్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):విశాఖలో ఈనెల 31నుంచి జరిగే 18వ సీఐటీయూ అఖిల భారత మహాసభలను విజవంవతం చేయాలని ఆ సంఘ కొత్తూరు మండలశాఖ కన్వీనర్ పనసరమేష్ కోరారు. మంగళవారం కొత్తూరులో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘ నాయకులు, ఇతర కార్మిక సంఘ నాయకులు జోష్న, గౌరమ్మ, ధనలక్ష్మి, రాజు, ఆనంద్ పాల్గొన్నారు.

ఆదాయాభివృద్ధికి రుణాల మంజూరు

మందస/హరిపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మందస మండల మహిళా స్వయంశక్తి సంఘాల అభివృద్ధికి మైక్రోక్రెడిట్ ప్లాన్ ద్వారా ఆదాయాభివృద్ధికి ప్రణాళిక ద్వారా రుణాలను మంజూరు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎల్.అనంతరావు తెలిపారు. మంగళవారం మందస గ్రామీణ బ్యాంకు మేనేజర్ జనార్దన్ ఆధ్వర్యంలో వెలుగుసిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు, బ్యాంకు ఫీల్డ్ అధికారులు, కోఆర్డినేటర్ తారకమోహన్, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

జమ్ముకాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

నరసన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట వద్ద గత ప్రభుత్వం హయంలో నిర్మించిన కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని కాలనీలకు చెందిన యువకులు కోరారు. ఈ మేరకు నరసన్నపేటలోని తహసీల్దార్ కార్యాలయం నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్ ఆర్.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో వీధి దీపాలు,రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

జలుమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరవంజ ఉన్నతపాఠశాలలో మంగళవారం యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ మండల కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. సంఘ మండలాధ్యక్షుడిగా హర్షవర్దన్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.పురుషోత్తంరావు, కోశాధికారిగా కె.రాజారావు, సహాధ్యక్షులుగా కె.రాజు, గౌరవాధ్యక్షుడిగా జి.రాముఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఆనందరావు, సభ్యులు పైల సూర్యనారాయణ, కె.శిమ్మన్న పాల్గొన్నారు.

ఎంఎంఎస్ ఎన్నిక పారదర్శకంగా నిర్వహించాలి

కొత్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల మహిళా సమాఖ్య (ఎస్ఎంఎస్) ఎన్నిక గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించాలని ఎంఎంఎస్ అధ్యక్షురాలు రవ్వల జయమ్మ కోరారు. మంగళవారం కొత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్లగా ఎంఎంఎస్ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించకపోవడంతో జిల్లా స్థాయి సంఘంలో అర్హత కోల్పోయి ఎటువంటి నిధులు రావడం లేదని తెలిపారు. మండలంలోని 46 గ్రామైక్య సంఘాలకు ఎంఎంఎస్ ఎన్నికకు పిలవకుండా వెలుగు అధికారులు స్వలాభం కోసం రహస్యంగా ఎన్నిక చేసేందుకు ప్రయత్నించడం మానుకోవాలని హితవుపలికారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

●గురుకుల విద్యాలయ సంస్థ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్‌కుమార్


రికార్డులను పరిశీలిస్తున్న సునీల్‌రాజ్‌కుమార్

పాతపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):పదోతరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ సంస్థ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్‌కుమార్ కోరారు. మంగళవారం పాతపట్నంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలను రికార్డులు, స్టోర్‌రూం, డార్మెటరీ, మరుగుదొడ్లు, మెనూనిర్వహణ, బోధన తీరును పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉత్తమఫలితాల సాధనకు బోధనసిబ్బంది కార్యా చరణప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ఆయన వెంట గురుకులాల జిల్లా సమన్వయాధికారి వై.యశోదలక్ష్మి, ప్రిన్సిపాల్ పి.పద్మావతి ఉన్నారు.

నాణ్యత లేక.. మరమ్మతులకు నోచుకోక

● అడుగడుగునా గోతులమయం ●ఇదీ నరసన్నపేటలో రోడ్ల దుస్థితి


గోతులమయమైన కంబకాయి రోడ్డు

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో వైసీపీ ప్రభుత్వం హయంలో నాణ్యత లేని రోడ్లు నిర్మించడం ముచ్చటగా మూడేళ్లకే అడుగడుగునా గోతులమయమయ్యాయి. ఈనేపథ్యంలో ప్రస్తుతం కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో పట్టణంలో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. కంబకాయి రోడ్డు, మారుతీనగర్, నేతాజీవీధి, కాలేజీరోడ్డు, పెద్దపేట, మార్కెట్ వీధి, కలివరపుపేట, భవానీపురం రోడ్లు దెబ్బతిన్నాయి. కళాశాల రోడ్డు నుంచి శాంతమ్మ ఆలయం వరకు ఇబ్బందులు తప్పడంలేదని పలువురు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వెళ్లే మార్గంలో కొంత దూరం రోడ్డు వేసి మిగతా మార్గం విడిచిపెట్టారు. ఇటీవల పలు వీధుల్లో వేసిన రోడ్లు సగం మాత్రమే వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ నిధులతో పూర్తిస్థాయిలో రోడ్లు వేయాలని కళింగ కోమటి అధ్యక్షుడు ఉన్న వెంకటేశ్వరరావు కోరారు.

రేపు హుండీల లెక్కింపు

పాతపట్నం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలోని రాధాగోవిందస్వామి, పాతపట్నంలోని నీలకంఠేశ్వరాలయంలో గల ధర్మహుండీలను గురువారం లెక్కించనున్నట్లు దేవదాయశాఖ ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. పాల్గొనే ఆశక్తిగల భక్తులు డ్రస్‌కోడ్ పాటించి ఆరోజు ఉదయం పది గంటలకు ఆలయ ప్రాంగణంలో చేరుకోవాలని పేర్కొన్నారు.

గోవిందపురంలో 'స్వచ్ఛభారత్'

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవ పథకంలో భాగంగా మంగళవారం గోవిందపురంలో స్వచ్ఛభారత్ నిర్వహించి పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించి బ్లీచింగ్ చల్లారు. గ్రామంలోని సాయిరాంవీధి, గొల్లవీధి, పుచ్చవీధి, బజార్‌వీధిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రోడ్లకు ఇరువైపుల ఉన్న చెత్తతొలగించి, గ్రామస్థులకు అవగాహనకల్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా వ్యక్తిత్వ వికాసంపై వలంటీర్లకు తెలుగు అధ్యాపకులు కేశవరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, ఝాన్సీ రాంబాబు, భాగ్యలక్ష్మి, శోభారాణి, అలేఖ్య, సౌజన్య, రమణ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోల నియామకం

పలాసరూరల్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):పలాస మండలంలో ఉన్న గ్రామ సచివాలయాలకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీవోగా ఉమాపతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంపీడీవో వసంత్‌కుమార్, ఎంఈవో శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

●పాతపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):పాతపట్నం మండల గ్రామవార్డు సచివాలయ అధికారిగా(జీఎస్‌డబ్ల్యూఎల్‌యూఎస్)అధికారిగా బి.కృష్ణారావు మంగళవారం బాధ్యతలను చేపట్టారు. రాజాం మండలం అంతకాపల్లి పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

●నందిగాం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఉప ఎంపీడీవోగా హనుమంతు ఉమాపతి బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం జిల్లా డీఎస్‌డీవోకార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేసి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.ఆయన్ను గ్రామసచివాలయాలకు సంబంధించి కార్యక్రమాలు పర్యవేక్షణకు ఉప ఎంపీడీవోగా కేటాయించారు.

పోర్టు వాహనాల అడ్డగింత

సంతబొమ్మాళి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మనాథపురం గ్రామస్థులు మూలపేట పోర్టు వాహనాలను మంగళవారం అడ్డుకున్నారు. మెయింటెన్స్ కోసం పోర్టు టిప్పర్‌ను రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. మెయింటెన్స్ పూర్తయిన తర్వాత లిఫ్ట్ డౌన్ చేయకుండా రోడ్డుపైకి రావడంతో విద్యుత్ వైరు టిప్పర్ మధ్యలో చిక్కుకుంది. ఇది గమనించని డ్రైవర్ ముందుకు వెళ్లడంతో వైర్లు మధ్య రాపిడి జరిగి మంటలు చేలరేగి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఒక్కసారిగా గ్రామస్థులు రోడ్డుపైకి వచ్చి పోర్టు వాహనాలను అడ్డుకున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు వాహనాలను కదలనీయబోమని గ్రామస్థులు నిరసనకు దిగారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్థులతో సంప్రదింపులు జరిపారు. అయితే గ్రామస్థులు వాహనాలను గంటల కొద్దీవదల లేదు. దీంతో పోర్టు హెచ్‌ఆర్ మేనేజర్ రాఘవరెడ్డి సంఘటన స్థలానికి వచ్చి సమస్య పరిష్కరించే బాధ్యత యాజమాన్యం తీసుకుంటుందని హామీఇవ్వడంతో గ్రామస్థులు వాహనాలను విడిచిపెట్టారు.

గట్కా పోటీలకు ఎంపిక

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): టెక్కలికి చెందిన పడాల అభిషేక్ రాష్ట్రస్థాయి అండర్-19 గట్కా పోటీల్లో సత్తాచాటి వచ్చే ఏడాది జనవరి 6 నుంచి పంజాబ్‌లోని లూధియానాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని బీఎస్‌జేఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే గతనెల 28 నుంచి 30 వరకు అనంతపురం జిల్లా జిగిచర్లలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో అండర్-19 విభాగంలో 44 కేజీల విభాగంలో కిల్లి కావ్య ద్వితీయస్థానం సాధించి కాంస్య పతకం సాధించిందని చెప్పారు.

● పలాసరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):బొడ్డపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదోతరగతి విద్యార్థి పోతనపల్లి చిరంజీవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు సైన్స్‌విభాగం పోటీలో ప్రతిభ కనబరిచాడు.భారతీయ విజ్ఞానమండలి, ఆప్‌కాస్ట్‌ఆధ్వర్యంలో శాస్త్రీయ విజ్ఞానంలో విద్యార్థుల అభిరుచిని పరిశీలించేందుకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి ఈనెల 27న తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. చిరంజీవిని ఉపాధ్యాయులు అభినందించారు.